# ఏ అభివృద్ధి కోసం.. పార్టీ మారారు

**ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌పై కార్తిక్‌రెడ్డి విమర్శలు**

శంషాబాద్ రూరల్, జూలై 15 : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 4 నుంచి 5వేల కోట్ల రూపాయలతో అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని అనేకసార్లు సభలు, సమావేశాల్లో ప్రకటించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్..మరీ ఏ అభివృద్ధి కోసం పార్టీ మారారో ప్రజలకు చెప్పాల్సిన అవసరమున్నదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత కార్తిక్‌రెడ్డి అన్నారు. సోమవారం శంషాబాద్ పట్టణంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గానికి దాదాపు 5వేల కోట్ల రూపాయల నిధులు ఇచ్చిన బీఆర్‌ఎస్‌ను కాదని.. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేస్తారో చెప్పాలన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను కబ్జా చేయడానికే పార్టీ మారినట్లు వినిపిస్తున్న వార్తలు నిజమేనా.. అని ప్రశ్నించారు. ఒకవేళ అదే జరిగితే.. ప్రభుత్వ భూములను పట్టా భూములుగా మార్చాలని చూస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. కేసీఆర్‌ను మోసం చేసి పార్టీ మారుతున్న నాయకులకు సరైన కాలంలో తగ్గిన శాస్తి జరుగుతుందన్నారు.


నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I హైదరాబాద్, మంగళవారం 16 జూలై 2024 RANGAREDDY


# నిబంధనలకు అనుగుణంగా బదిలీలు చేపట్టాలి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, జూలై 15(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా బదిలీలు చేపట్టాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ జిల్లా అధికారులతో బదిలీల ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ప్రతి కేడర్‌లోనూ 40 శాతానికి మించకుండా బదిలీల ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో ప్రజాస్వామ్యం పరిహాసం

- బోనాల చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్‌కు తిలోదకాలు
- అధికారుల తీరుపై మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నిరసన

ఆర్కేపురం, బడంగ్‌పేట, జూలై 15: ప్రజలు తిరస్కరించిన వ్యక్తిని వేదికపై కూర్చోబెట్టి, ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన ఎమ్మెల్యేను కింద కూర్చోబెట్టడమేనా.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజాపాలన అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత వ్యవస్థలన్నీ నాశనమవుతున్నాయని విమర్శించారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్‌లోని ఖిల్లా మైసమ్మ దేవాలయ ఆవరణలో సోమవారం ఆషాఢ మాస బోనాల దశాబ్ది ఉత్సవాల-2024 చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే అయిన సబితా ఇంద్రారెడ్డిని ఆహ్వానించారు. ఇదే కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ రావు కూడా హాజరయ్యారు. అయితే అధికారిక కార్యక్రమాల్లో సంబంధం లేని వ్యక్తులను వేదికపైకి పిలువడంపై ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేశారు.



నేలపై కూర్చుని నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ శ్రేణులు

అధికారిక కార్యక్రమాల్లో ఇతర వ్యక్తులు రావడానికి వీలు లేదన్నారు. ఏ హోదాలో కాంగ్రెస్ నాయకులను వేదిక మీదకు పిలుస్తున్నారని నిలదీశారు. అధికారిక కార్యక్రమాలకు పార్టీ నాయకులను పిలవడంపై ఆమె నిరసన తెలిపారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకున్నది. కాంగ్రెస్ నాయకుడు కేఎల్‌ఆర్‌తో పాటు మరికొంత మంది ఆ పార్టీ నేతలు వేదిక మీదకు రావడంతో ఎమ్మెల్యే కిందకు దిగిపోయారు. వేదిక కింద కూర్చొని నిరసన తెలిపారు. సలహాదారు వేణుగోపాలరావు ఎమ్మెల్యేకు నచ్చ చెప్పే ప్రయత్నం చేసినా.. ఆమె అంగీకరించలేదు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... ప్రొటోకాల్ పాటించకుండా, ప్రజలతో ఎన్నుకున్న ఎమ్మెల్యేలను అగౌరపరుస్తున్నారని, ప్రజాప్రతినిధులను గౌరవించే సంప్రదాయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలన్నారు. ఎమ్మెల్యేతో పాటు ఓడిపోయిన అభ్యర్థి కూడా స్టేజీ మీద ఉన్నారంటే, సీఎం రేవంత్‌రెడ్డి కూడా కొడంగల్‌లో తనపై ఓడిపోయిన అభ్యర్థిని తీసుకొచ్చి ప్రభుత్వ కార్యక్రమాల్లో స్టేజీపై తన పక్కన కూర్చోబెట్టుకొనే విధంగా చట్టం తేవాలన్నారు. బోనాల పండుగ ఉత్సవాలకు నిధులివ్వాలనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందే కేసీఆర్ అని తెలిపారు. 60వేల ఓట్లతో తనపై ఓడిపోయిన వ్యక్తిని స్టేజీపైకి తీసుకొచ్చి ప్రొటోకాల్ పాటించకుండా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారనన్నారు. ప్రభుత్వం తమదేనని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే... ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.



ప్రొటోకాల్ పాటించకపోవడంతో నిలదీస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి

## పేదలకు తులం బంగారమిస్తే సంతోషించేవారం..

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నుంచి ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులతో తులం బంగారం ఇచ్చి పంపిస్తే స్వాగతించేవాళ్లమని సబితాఇంద్రారెడ్డి అన్నారు. గతంలో బోనాల ఉత్సవాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఇన్‌చార్జీల వ్యవస్థ లేదని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇదేరీతిన ప్రొటోకాల్ సమస్య తలెత్తుతున్నదన్నారు. ఈ విషయంలో స్పీకర్ జోక్యం చేసుకొని ప్రొటోకాల్ సమస్యను పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో వ్యవస్థలన్నీ అస్తవ్యస్థంగా మారాయని విమర్శించారు. ఒక పక్క ఆందోళన కొనసాగుతుండగానే వేణుగోపాల్‌రావు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాత, చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు కాంగ్రెస్ స్థానిక ప్రతినిధులతో కలిసి పలు ఆలయ కమిటీలకు చెక్కులను పంపిణీ చేసి వెళ్లిపోయారు. నిరసనలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేశ్, లోకసాని కొండల్‌రెడ్డి, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కొంఢ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, సాజీద్, పెంబర్తి శ్రీనివాస్, సిద్దగోని వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

# దంచికొట్టిన వాన..

- వికారాబాద్ జిల్లాలో మరో రెండు రోజులు భారీ వర్ష సూచన
- అత్యవసర సాయానికి అందుబాటులో విపత్తుల నిర్వహణ సంస్థ సిబ్బంది
- వాగుల వద్ద ఎలాంటి అనుకోని సంఘటనలు జరుగకుండా చర్యలు
- జిల్లాలోని నవాబుపేట మండలంలో అత్యధికంగా 91.2 మి.మీటర్ల వర్షపాతం నమోదు
- శనివారం సాయంత్రం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షం

వికారాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : వికారాబాద్ జిల్లాలో వర్షం దంచికొట్టింది. వానకాలం ప్రారంభం నాటి నుంచి అడపాదడపా వర్షాలు కురవగా, శనివారం సాయంత్రం నుంచి జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మరో రెండు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది. జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. అత్యవసర సమయంలో సాయమందించేందుకుగాను విపత్తుల నిర్వహణ సంస్థ సిబ్బందిని అందుబాటులో ఉంచడంతోపాటు కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. వాగుల వద్ద పోలీసు భద్రతను ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జూన్ నెలలో సాధారణ వర్షపాతానికి మించి నమోదైనప్పటికీ ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. జూలై నెలలో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 77.8 మి.మీటర్ల కాగా, ఇప్పటివరకు 147.1 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. జూలై నెలలో ఇప్పటివరకు సాధారణానికి మించి 89 మి.మీటర్ల వర్షపాతం అధికంగా నమోదైంది. జిల్లాలోని అన్ని మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది.

### నవాబుపేట మండలంలో 91.2 మి.మీటర్ల వర్షపాతం..

జిల్లాలో భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన వర్షంతో జిల్లావ్యాప్తంగా 41.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. నవాబుపేట మండలంలో అత్యధికంగా 91.2 మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా, కోట్‌పల్లి మండలంలో 60.8 మి.మీటర్లు, బంట్వారం మండలంలో 60.2 మి.మీటర్లు, వికారాబాద్ మండలంలో 56.4 మి.మీటర్లు, బషీరాబాద్, పూడూరు మండలాల్లో 47.4 మి.మీటర్లు, మోమిన్‌పేట మండలంలో 42.4 మి.మీటర్లు, యాలాల మండలంలో 38.6 మి.మీటర్లు, తాండూరు మండలంలో 38.4 మి.మీటర్లు, దోమ, దుద్యాల మండలాల్లో 35.2 మి.మీటర్లు, పెద్దేముల్ మండలంలో 34.2 మి.మీటర్లు, కొడంగల్ మండలంలో 34.8 మి.మీటర్లు, చౌడాపూర్ మండలంలో 30.6 మి.మీటర్లు, దౌల్తాబాద్ మండలంలో 21.6 మి.మీటర్లు, కులకచర్ల మండలంలో 24.6 మి.మీటర్లు, పరిగి మండలంలో 28.6 మి.మీటర్లు, మర్పల్లి మండలంలో 26.6 మి.మీటర్లు, బొంరాస్‌పేట మండలంలో 15 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.



## మంచిరోజులు పోయె..

# మందుల్లేని రోజులొచ్చె

**ఆసుపత్రుల్లో వైద్య సేవలు, మందుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన ఉండడం లేదు. వసతుల లేమి, డాక్టర్లు, సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి సరిపడా మందులు సైతం లభించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ప్రైవేటు దవాఖానలకు దీటుగా వైద్యం లభించి, ఏ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోగా..ప్రస్తుతం పరిస్థితి తలకిందులైందని ప్రజలు వాపోతున్నారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో ప్రభుత్వ ఆసుపత్రులు కిటకిటలాడుతుండడం..అందుకు తగ్గట్టుగా మందులు లేకపోవడంతో నిరుపేదలకు ఆర్థిక భారం తప్పడం లేదు.**

**- రంగారెడ్డి, జూలై 15 (నమస్తే తెలంగాణ)**

- సీజనల్ వ్యాధులతో దవాఖానల్లో పెరిగిన ఓపీ
- రద్దీకి తగ్గట్టుగా మందులు లేక అవస్థలు పడుతున్న రోగులు
- ఇండెంట్ పెట్టినా..అరకొరగానే కేటాయింపులు
- విధిలేక ప్రైవేటుగా కొనుగోలు చేస్తున్న ప్రజానీకం




రంగారెడ్డి జిల్లాలో 28 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 25 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 70 బస్తీ దవాఖానలు, 122 పల్లె దవాఖానల ద్వారా వైద్య సేవలను అందిస్తున్నారు. అయితే సర్కారు దవాఖానల్లో చికిత్స కోసం వచ్చే నిరుపేద రోగులకు మందుల కొనుగోలు పెను భారంగా మారుతున్నది. వైద్య సేవలు ఉచితంగానే అందుతున్నా.. కొన్ని రకాల మందులను మాత్రం ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఇటు వికారాబాద్ జిల్లాలోని పలు ప్రభుత్వ దవాఖానల్లోనూ మందుల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. నెలరోజులుగా తాండూరులోని జిల్లా ఆసుపత్రితోపాటు మాతాశిశు సంరక్షణ, ఇతర ప్రభుత్వ దవాఖానల్లో మందుల కొరత ఉండడంతో రోగులు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. అవసరమైన మందుల కోసం ఇండెంట్ పెడుతున్నప్పటికీ ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో కొరత ఏర్పడుతున్నది. మందుల కొరత విషయమై సంబంధిత అధికారిని వివరణ కోరగా.. రెండు రోజుల క్రితమే మందులు వచ్చాయంటూ దాటవేసే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. చాలామంది వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. అక్కడక్కడా డెంగీ వంటి కేసులు సైతం నమోదవుతున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో జ్వరం, జలుబు, దగ్గు వంటి రుగ్మతలతో ప్రజానీకం ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తుండడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. డాక్టర్లు పరీక్షించి ఐదారు రకాల మందులు రాస్తే.. అందులో ఒకటి, రెండు రకాలకు మించి దొరకడం లేదు. కొన్ని ఆసపత్రులలో సెలైన్ ఎక్కించేందుకు ఉపయోగించే ఐవీ సెట్‌లు సైతం లేవు. ఇంకొన్ని ఆసుపత్రులలో చిన్న పిల్లలకు సంబంధించిన దగ్గు సిరప్, కంట్లో వేసుకునే చుక్కల మందులు సైతం అందుబాటులో లేవు. ఉమ్మడి జిల్లాలోని చాలా వరకు ప్రభుత్వ ఆసుపత్రులది దాదాపు ఇదే పరిస్థితి.

**ఇండెంట్ పెట్టినా.. అరకొరగానే సరఫరా..**

ఆసుపత్రులలో నిత్యం నమోదవుతున్న ఓపీని పరిగణనలోకి తీసుకుని సరిపడా మందుల కోసం నెలనెలా ఇండెంట్ పెట్టాల్సి ఉంటుంది. ఆసుపత్రికి కేటాయించిన బడ్జెట్‌కు అనుగుణంగా కొన్ని మందులు, అత్యవసర పద్ధతిలో మరికొన్ని మందులను ఆసుపత్రి వర్గాలు సమకూర్చుకోవాలి. అయితే గత కొద్దిరోజులుగా ఆసుపత్రులకు సరిపడా మందులు సరఫరా కావడం లేదు. ఫార్మాసిస్టులు ఇండెంట్ పెట్టినప్పటికీ కొంతమేరకే మందులను అందజేస్తున్నారు. దీనివల్ల ఆసుపత్రుల్లో రోగులకు మందులను సర్దుబాటు చేయాల్సి వస్తున్నది. ఒకటి, రెండు రోజులకు సరిపడా మాత్రమే ఇస్తున్నారు. కొన్ని దవాఖానల్లో పరిస్థితి మరోలా ఉన్నది. కొంతమంది డాక్టర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఆసుపత్రులపై పర్యవేక్షణ లేకుండా పోయింది. దీనివల్ల ఆసుపత్రులలో నమోదవుతున్న ఓపీని సైతం వారు తెలుసుకోలేకపోతున్నారు. దీనివల్ల ఎంతమేర మందులు అవసరం పడుతాయో! ముందుగానే అంచనా వేసుకోక ఫార్మాసిస్టుల ద్వారా ఇండెంట్ సైతం పెట్టడం లేదు. ఫలితంగా ఆయా ఆసుపత్రులు ప్రస్తుత పరిస్థితుల్లో మందుల కొరతను ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఏటా ఈ సీజన్‌లో వ్యాధులు ప్రబలుతాయని డాక్టర్లకు తెలిసినప్పటికీ ముందస్తుగా స్టాక్ పెట్టుకోకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోగులకు అన్ని రకాల మందులు ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉండేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

**బయట కొనుక్కోమన్నారు..**



తాండూరు మాతా శిశు ఆసుపత్రిలో నా బిడ్డకు డెలివరీ అయ్యింది. డాక్టరు మందులు రాసి ఇచ్చిండ్రు. కొన్ని మందులు ఇక్కడనే ఇచ్చిండ్రు. ఇంకొన్ని బయట తీసుకోమన్నరు. డబ్బులు లేకనే గవర్నమెంటు ఆసుపత్రికి వచ్చినం. మందులు బయట తీసుకోమంటే ఎట్లా. మా దగ్గర డబ్బులు ఎక్కడివి. మా దగ్గరే డబ్బులు ఉంటే ప్రైవేటుకు పోయటోళ్లం కదా. మాలాంటి పేదల కోసం రోగులకు సరిపడా మందులను అందుబాటులో ఉంచాలి.

-కవ్వ నర్సింహులు, బీరెల్లి గ్రామం, కోట్‌పల్లి మండలం,, వికారాబాద్ జిల్లా

# నిరుద్యోగుల నిర్బంధం

- సెక్రటేరియట్ ముట్టడికి వెళ్తున్నవారిని అడ్డుకున్న పోలీసులు
- అర్ధరాత్రి అక్రమ అరెస్టులు.. పీఎస్‌కు తరలింపు


కొడంగల్, జూలై 15 : కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్ ఆరోపించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగుల తరఫున శాంతియుతంగా నిరసన తెలుపుతుం టే ప్రభుత్వం దాడులు చేయిస్తున్నదన్నారు. అర్ధరా త్రి అక్రమంగా అరెస్టు చేసి ఠాణాల్లో ఉంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన నిరంకుశంగా సాగుతున్నదని.. భావస్వేచ్ఛను హరిస్తున్నదని ఆరోపించారు. ఇటువంటి అక్రమ అరెస్టులకు పాల్పడితే ప్రజలు సహించారని, సరైన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

### ముందస్తు అరెస్టులు..

తాండూరు : నిరుద్యోగులు తమ డిమాండ్ల కోసం నిరసనలు చేస్తుంటే కాంగ్రెస్ సర్కార్ పోలీసులతో అడ్డుకోవడం సరికాదని గ్రంథాలయ సంస్థ వికారాబాద్ జిల్లా మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ తాండూరు సీనియర్ నాయకుడు రాజుగౌడ్ అన్నారు. సోమవారం శాంతియుత మార్గంలో సెక్రటేరియట్ ముట్టడికి తలపెట్టిన బీఆర్‌ఎస్వీ ప్రతినిధులను ముందస్తుగా అరెస్టులు చేయడం హేయమైన చర్య అన్నారు. బీఆర్‌ఎస్వీ ప్రతినిధులు దత్తత్రేయ, సందీప్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా కాంగ్రెస్ నీచమైన చర్యలకు పాల్పడడం బాధాకరమన్నారు. నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**పీఎస్‌కు బీజేపీ, బీజేవైం నేతలు..**

కులకచర్ల/పూడూరు : నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో సెక్రటేరియట్ ముట్టడికి బయలు దేరుతున్న బీజేవైఎం పరిగి పరిగి నియోజకవర్గ కన్వీనర్ గడుసు మహిపాల్‌ను కులకచర్ల పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే పూడూరులో బీజేపీ నాయకులు కంకల్ రవీందర్, రాజులు చన్గోముల్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించాలనుకుంటే ఎక్కడికక్కడే అరెస్టులు చేస్తూ ధర్మమైన ఉద్యమాన్ని అడ్డుకోవడం తగదన్నారు. కార్యక్రమంలో లంబాడ పోరాట హక్కుల సమితి నాయకుడు రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.




దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్